క్లుప్తంగా

వేగంగా సీసీ రోడ్డు పనులు



సిమెంట్ రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

శిరివెళ్ల: స్థానిక ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేయడంతో పనులు చేపట్టారు. 2019 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ కాలనీకి వచ్చే దారికి సిమెంట్ రోడ్డు వేయాలని నాడు ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డికి కాలనీవాసులు విన్న వించుకోగా రోడ్డు పనులు చేయించారు.

నివాళి

శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం, మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్ఎండీ ఖాసీం (75) గుండెనొప్పితో మరణించాడు. ఈ మేరకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి బుధవారం ఆయన ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, ఎంపీపీ నాయక్ వసీం, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్ సంతాపం వ్యక్తం చేశారు.

ప్రథమ నంది ఆలయంలో స్వచ్ఛ సేవ



ఆలయంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న దృశ్యం

నంద్యాలఅ(వ్యవసాయం): స్థానిక ప్రథమనంది దేవస్థానంలో మన ఊరు–మనగుడి, మన బాధ్యత నిర్వాహకులు బుధవారం స్వచ్ఛ సేవ కార్యక్రమం చేపట్టారు. నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మంగళవారం ప్రథమ నంది ఆలయంలో జరిగిన చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలకు వేలాది మంది రావడంతో ఆలయంలో ఉన్న చెత్తా చెదారం, ప్లేట్లు, గ్లాసులు తదితర వాటిని శుభ్రం చేశామన్నారు. అనంతరం మున్సిపాలిటీ సిబ్బంది చెత్తను తరలించారని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మన ఊరు, మనగుడి, మన బాధ్యత నిర్వాహకులను ఆదర్శంగా తీసుకొని పట్టణంలో కార్యక్రమాలు నిర్వహిస్తే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా మారుతుందని చెప్పారు.

ఆధ్యాత్మికతతో శాంతిమార్గం



వేణుగోపాల ఆశ్రమంలో గీతాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఉయ్యాలవాడ: ఆధ్యాత్మికం శాంతి మార్గాన్ని పెంపొందిస్తుందని సుప్రేమానంద మాతాజీ యోగానంద సరస్వతీ మాతాజి తెలిపారు. బుధవారం రెండో రోజు స్థానిక వేణుగోపాల స్వామి ఆశ్రమంలో ఏక విశ్రాంతి వేడుకలు కొనసాగాయి. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వార్థాన్ని విడనాడాలన్నారు. ఆధ్యాత్మికత భావాల ద్వారా మోక్షం లభిస్తుందన్నారు. వేడుకల్లో భాగంగా కృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో 16 జంటలు గీతాయజ్ఞం, హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు మాహానందీశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

సుందరకాండ మహాయజ్ఞం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో వేదపండితులు యాదవల్లి కార్తికేయశర్మ ఆధ్వర్యంలో బుధవారం సుందరకాండ మహాయజ్ఞం ప్రారంభించారు. ఉదయం గోపూజ, మహాగణపతి పూజ, పుణ్యాహ వాచనం, మాతృకాపూజ, నాంది ఆహ్వానం, రక్షణ కంకణ ధారణ, పంచగవ్య మేళనం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ పూజ, ప్రధాన కలశ ఆహ్వాన పూజలు నిర్వహించారు. సుందరకాండ ఆహ్వానం నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం ప్రదోష పూజ, మూలమంత్ర జపాలు, తులసీ అర్చన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆస్తులు ప్రైవేటీకరించడం తగదు

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు పరం చేయడం కేంద్ర ప్రభుత్వానికి తగదని ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ నంద్యాల శాఖ కార్యదర్శి రమేష్‌బాబు పేర్కొన్నారు. సంఘం జాతీయ కమిటీ పిలుపు మేరకు ఢిల్లీలో నిర్వహిస్తున్న కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ ర్యాలీకి ఎల్ఐసీ ఉద్యోగులు బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అధ్యక్షురాలు హరిప్రియ, జాయింట్ సెక్రటరీ వెంకటరాముడు, కోశాధికారి శుక్లా, వసుంధర, సభ్యులు పాల్గొన్నారు.

పడిపోయిన బొప్పాయి ధర

- ముంచిన వడగండ్ల వాన
- వైరస్ సోకి.. కాయలు చిన్నగా ఉన్నప్పుడే పండుగా మారి రాలిపోతున్న వైనం
- రూ.18వేల నుంచి రూ.8వేలకు టన్ను ధర



వడగండ్ల వానకు ముందు కాయలతో బొప్పాయి చెట్టు



ప్రస్తుతం వైరస్ సోకి ఇలా..



ఆర్.నాగులవరం వద్ద బొప్పాయి కాయలను ప్యాక్ చేస్తున్న మహిళలు



వాహనాల్లోకి చేర్చుతున్న కూలీలు

రుద్రవరం: బొప్పాయి ధర ఒక్కసారిగా పడిపోయింది. కొద్ది రో జుల క్రితం టన్ను బొప్పాయి పండ్లు రూ.18 వేలు పలుకగా నేడు కేవలం రూ. 8 వేలు మాత్రమే లభిస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రంతో పాటు రెడ్డిపల్లె, ఆర్.నాగులవరం, తిప్పారెడ్డిపల్లె.ఆలమూరు తదితర గ్రామాల పరిధిలో దాదాపు 150 ఎకరాల్లో బొప్పాయి తోటలు సాగు చేశారు. చెట్లు ఏపుగా పెరిగి నిండు కాపుతో చెట్లు కళకలాడేవి. కాయలు ఆశించినంత సైజు ఉండటంతో వ్యాపారులు టన్ను రూ.18 వేల ప్రకారం కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. అయితే గత నెలలో కురిసిన వడగండ్ల వాన ప్రభావంతో వ్యాపారం కుప్పకూలింది. చెట్లకు వైరస్ సోకి కాయల సైజు చిన్నగా ఉండగానే పండ్లుగా మారి రాలిపోతున్నాయి. చేసేది లేక రైతులు స్థానికంగా ఉన్న వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయించుకుంటున్నారు. వడగండ్ల వాన లేకపోతే మంచి లాభాలు వచ్చేవని తోటల రైతులు పేర్కొంటున్నారు.

ఎస్సీ,ఎస్టీ కేసుపై విచారణ

శిరివెళ్ల: మండలంలోని జీనేపల్లెకు చెందిన ఎస్సీ, ఎస్టీ కేసుపై బుధవారం డీఎస్పీ సుధాకర్‌రెడ్డి విచారణ చేశారు. షేక్ ఉశేన్‌బీ పొదుపు సంఘం యానిమేటర్‌గా పనిచేస్తుంది. గత నెల 4వ తేదీన పొదుపు సంఘం రుణ వసూళ్లలో భాగంగా నక్కా శిరోమణి ఇంటికి వెళ్లి కులం పేరిట దూషించిందనే ఫిర్యాదుపై ఆమెపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. కులం పేరిట దూషించారా లేదా అని సాక్షులను స్థానిక సీఐ కార్యాలయానికి పిలిపించి డీఎస్పీ విచారణ చేశారు. కార్యక్రమంలో సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానందిలో ఒంగోలు జడ్జి

మహానంది: ఒంగోలు ఎనిమిదో అదనపు జిల్లా న్యాయమూర్తి అమ్మణ్ణరాజ సతీసమేతంగా బుధవారం మహానంది వచ్చారు. ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో న్యాయమూర్తి అమ్మణ్ణరాజ దంపతులకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గోస్పాడు: వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి గోపాల్ తెలిపారు. బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రమవుతున్నందున చిన్న పిల్లలు, వృద్ధులు ఎండలకు బయటకు వెళ్లరాదని గ్రామీణులకు అవగాహన కల్పించాలని చెప్పారు. వడదెబ్బకు చిన్న పిల్లలకు అతిసారం, నీళ్ల విరేచనాలు వంటి వ్యాధులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకునేలా తల్లిదండ్రులకు సూచించాలన్నారు. పనులకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని, ఎండలో పనులు చేయరాదని కోరారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ఆదరణ అపురూపం



చాగంటి కోటేశ్వరరావుకు అభివాదం చేస్తున్న స్వచ్ఛ సేవకులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాలలో మంగళవారం నిర్వహించిన శ్రీమద్రామాయణ వైభవం ప్రవచన ఆధ్యాత్మిక సభకు వేల సంఖ్యలో భక్తులు హాజరై, చూపిన ఆదరణ అపురూపమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఓ హోటల్ ప్రాంగణంలో వివిధ సాహితీ, ధార్మిక సేవా సంస్థల ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల నంద్యాల ప్రజల అభిమానాన్ని, ఆసక్తిని ప్రశంసించారు. కార్యక్రమ నిర్వహణకు చక్కని ఏర్పాట్లు చేశారని మన ఊరు,మనగుడి, మన బాధ్యత, ఆపద్బంధ్ సేవా సొసైటీ, నవ నిర్మాణ సమితి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులను అభినందించారు. వీరి ప్రోత్సాహం వల్ల పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని రికార్డు సృష్టించారన్నారు. కార్యక్రమంలో గుంటూరు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి, డాక్టర్ సహదేవుడు, మధుసూదనరావు, గోర్ల సుదర్శనం, చింతలపల్లె వాసు, వలంటీర్లు పాల్గొన్నారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

- రూ.2.24 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి



5వార్డులో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల: పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతానని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 2వ వార్డులో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, 5వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, 11వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాతో కలిసి ప్రారంభించారు. అలాగే కేఎస్ఎం పురపాలక ఉన్నత పాఠశాలలో ఎంపీ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ కేంద్రాన్ని, నాడు–నేడు కింద రూ.94 లక్షలతో నిర్మిస్తున్న నూతన తరగతి గదులు, టాయిలెట్స్ నిర్మాణం, పలు తరగతి గదులకు మరమ్మతులకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో రూ.2.24 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, మరిన్ని పనులు చేపడతామని చెప్పారు. అభివృద్ధి జరగలేదని చెబుతున్న ప్రతిపక్ష నాయకులు, ఎల్లో మీడియా నంద్యాలలో చేసిన, చేస్తున్న అభివృద్ధి పనులను చూసి మాట్లాడాలన్నారు. టీడీపీ నాయకులు ఓటు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో మెడికల్ కళాశాల, హాస్పిటల్, ఐటీఐ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన తరగతి గదుల నిర్మాణం, బాలుర, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాల నిర్మాణం, ఏపీ మోడల్ స్కూల్ నిర్మాణం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, పార్కులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఇలా అనేక అనేక అభివృద్ధి పనులు చేశామని, ఇంకా చేస్తామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, ఫుడ్ ప్రాసెసింగ్ చైర్మన్ డాక్టర్ కల్లూరి రామలింగారెడ్డి, బెస్త సంఘం రాష్ట్ర డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్, దృశ్య కళల డైరెక్టర్ సునీత అమతరాజ్, కౌన్సిలర్లు సాదిక్, ఆరిఫ్ నాయక్, తమీం పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి



ఉయ్యాలవాడలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ



నంద్యాలలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం)/(అర్బన్): బాబూ జగ్జీవన్‌రామ్‌ను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయవేత్త బాబు జగ్జీవన్‌రాం 116వ జయంతిని పట్టణంలో బుధవారం నిర్వహించారు. పలువురు ప్రజాసంఘాల నాయకులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోనున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే.. పీఆర్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు భాస్కరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి హనుమంతు, కృష్ణారావు మాట్లాడుతూ బాబుజగ్జీవన్‌రామ్ జీవనవిధానాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విజయరావు, శ్రీనివాసులు, శంకరయ్య, శ్రీధర్ రెడ్డి, జాఫర్ పాల్గొన్నారు. రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జిల్లా స్థాయి సీనియర్ చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, ఆర్బిటర్లు ఇమాం హుసేన్, సుజాత, రవినాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్ రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూమాల వేసి నివాళులర్పించారు. ఊకొట్టువాసు, ఎస్‌వైడీ ప్రసాద్, సేవాదళ్ మహిళా నాయకురాలు జయలక్ష్మి, ప్రియ, సరిత పాల్గొన్నారు.

రుద్రవరం: బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు విద్యార్థులకు సూచించారు.బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం ఏపీ మోడల్ పాఠశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే నిజమైన నివాళులర్పించినట్లని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఓబులేసు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం, ఎస్సీ బాలుర వసతిగృహ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి, ఏఈఓ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రాం జయంతిని బుధవారం నిర్వహించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సాలమ్మ, ఈఓఆర్డీ సాల్మన్‌రాజు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బి.అబ్దుల్ సలాం, ఉప సర్పంచు ఇంతియాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: తంత్ర్య సమరయోధుడు మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతినివారం స్థానిక తహసీల్దార్ కార్యలయంలో డీటీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే చాగలమర్రి జెడ్పీ ఉన్నత, ఆర్‌సీఎం పాఠశాల ఆవరణలో హెచ్ఎం కోటయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

రైతు భరోసా నమోదు చేయండి

గోస్పాడు: రైతు భరోసా 2023–24కు కొత్తగా నమోదు చేయాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా నూతనంగా నమోదు చేయడానికి సైట్ ఓపెన్ అయ్యిందని, అర్హులైన కొత్త రైతుల నమోదు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయవచ్చన్నారు. అదే సమయంలో అనర్హుల కోసం స్టాప్ పేమెంట్ పోర్టల్‌లో చెల్లింపును ఆపాలన్నారు. నామినీల కోసం ముందుగా డెత్ కేసు చెల్లింపును ఆపివేసి ఆపై నామినీ వివరాలను నమోదు చేయాలని చెప్పారు. ఇప్పటికే పథకం ప్రయోజనం పొందిన లబ్ధిదారులను పోర్టల్‌లో నమోదు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతులకు కొత్తగా రిజిస్ట్రేషన్లు ప్రారంభించేందుకు పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ జిరాక్స్, ఆధార్‌కార్డు, రైతుల ఫొటో, బ్యాంకు అకౌంట్ పుస్తకం వంటి జిరాక్స్‌లను సమీప రైతు భరోసా కేంద్రంలో, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించవచ్చన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి,సంక్షేమాన్ని ప్రజలకు వివరిద్దాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యలయంలో 'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతి ఇంటికి అందించామన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి గృహ సారథులు, వలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందిన తీరును వివరించాలని చెప్పారు. అలాగే అర్హత ఉండి ఏదైనా పథకం రాకపోతే ఎందుకు రాలేదో? ఎప్పుడు వస్తుందో రాదో? వారు సంతృప్తి చెందేలా వివరించాలన్నారు. మనం చేసిన పథకాలను వివరించి ఇంటి యజమాని అనుమతితో జగనన్నే మా నమ్మకం అనే స్టిక్కర్ అతికించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగన్న ప్రభుత్వాన్ని తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేద్దామని తెలిపారు. గతంలో పథకాలు అందినతీరు, ఇబ్బందులు, పాలన తీరును ప్రజలకు ప్రస్తుత పరిస్థితులను పోల్చి వివరించాలని చెప్పారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు సింగం వెంకటేశ్వరరెడ్డి, భద్రి సుధాకర్‌రెడ్డి, మాదం చెన్నయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం



పాండురంగాపురంలో పథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): రాష్ట్రంలోని పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాండురంగాపురం గ్రామంలో గ్రామ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో వర్తించిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇంకా ఎవరైనా అర్హులై ఉండి పథకాలు అందకపోతే ధ్రువ పత్రాలతో స్థానిక గ్రామ సచివాలయంలో సంప్రదించాలని, అధికారులు విచారణ చేసి వర్తింపజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, నంద్యాల మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పురుషోత్తమరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, సర్పంచ్ దోలావతి, ఎంపీటీసీ బసవసుబ్బారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, రామచంద్రుడు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బొమ్మలసత్రం: ఈనెల 9,10 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహిత్య సభకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీశ్రీ కళావేదిక నంద్యాల జిల్లా అధ్యక్షుడు చిలకల బాలరాజు మాట్లాడుతూ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు టైలర్ శివయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావలి, మోహన్‌రావు, రవికుమార్ పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికే సంక్షేమ పథకాలు

గోస్పాడు: పేద ప్రజల అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అర్హులకు అందేలా తమ వంతు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎం.కృష్ణాపురం, కానాలపల్లె, జూలెపల్లి, నెహ్రూనగర్ తదితర గ్రామాల్లో బుధవారం గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేస్తున్నా ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, పథకాలపై వార్డు, గ్రామ స్థాయి నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికీ వివరించాలని తెలిపారు. సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.





మండుటెండలో క్రిష్టిపాడు వద్ద మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న మహిళలు, దొర్నిపాడు పొలాల్లో తలకు గుడ్డ చుట్టుకొని మొక్కజొన్న వ్యర్థాలను తొలగిస్తున్న మహిళలు

ఎండను అధిగమిస్తూ..ఘాటును భరిస్తూ

దొర్నిపాడు: ఓవైపు భగభగమంటున్న భానుడు..మరోవైపు మిర్చి ఘాటు. అయినా కూలీలు ఎండలోనే మిరప గ్రేడింగ్ పనులు చేస్తున్నారు. మండలంలో చాకరాజువేముల, దొర్నిపాడు, క్రిష్టిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో ప్రస్తుతం మిర్చి కోతలు, ఆరబోత, గ్రేడింగ్, కుప్పలే వేయడం, సంచుల్లో నింపే పనులు జోరుగా సాగుతున్నాయి. ఆయా పనులకు మహిళా కూలీలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ఎండ మండుతున్నా తలకు గుడ్డలు చుట్టుకొని పనులు చేస్తున్నారు. రోజుకు ఒక్కొరికీ రూ.500 వరకు కూలి ఇస్తున్నారు. వారు మాట్లాడుతూ.. అధిక కూలి ఇస్తున్నప్పుడు ఎండ తీవ్రత పేరుతో ఇంట్లో ఉంటే ఎలా అంటూ ప్రశిస్తున్నారు. కాగా ప్రస్తుతం మిరప పనులు అధికంగా ఉండటం, అలాగే మొక్కజొన్న, జొన్న కోతలు పూర్తవడంతో పొలాల్లో వాటి వ్యర్థాలను తొలగింపజేస్తున్నారు దీంతో కూలీలకు డిమాండ్ నెలకొంది.

తీర్మానాల అమలుకు పోరాటం

నంద్యాల(అర్బన్): ఈ నెల 3, 4 తేదీల్లో నంద్యాల సీపీఐ జిల్లా సమితి కార్యవర్గ సమావేశంలో చేసిన తీర్మానాల అమలుకు పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం సమావేశంలో చేసిన తీర్మానాలపై స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్యాసింజర్ రైలు పునరుద్ధరణ, సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం, వలసల నిలుపుదల, కృష్ణానది జలాలు, బలవంతపు భూసేకరణ తదితర వాటిపై పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కేంద్రం నిరంకుశ పాలనపై ప్రచార యాత్ర

నంద్యాల(అర్బన్): కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిరంకుశ పాలనపై ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ప్రచార యాత్ర చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సీపీఐ, సీపీఎం నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలను దోచుకొని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తోందని ఆరోపించారు. మతోన్మాద విధానాలు, అధిక ధరలు, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, జీఎస్టీ భారాలు తదితర వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి వారి తీరును ఎండ గడతామని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తామని స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు, కడప ఉక్కు, రాజధాని నిర్మాణం తదితర వాటికి నిధులు ఇవ్వడంకపోవడం వంటి వాటిపై ప్రజల్లో చైతన్యం తెస్తామన్నారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, ప్రసాద్ పాల్గొన్నారు.